షూటింగ్ బాల్ జిల్లా జట్టుకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి మండలంలోని కన్నెమడుగు ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు మదన్మోహన్, పీడీ ఖాదర్ బాషా తెలిపారు. ఆదివారం మదనపల్లిలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో యోగేంద్ర, సుమిత్ర, ప్రణీత, సంధ్య, ఫ్యాన్ బై ప్లేయర్లుగా రిషిత ప్రతిభ చూపి అన్నమయ్య జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 26, 27వ తేదీలలో మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

షూటింగ్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

రాములోరి కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం పండుగ వాతావరణంలో భక్తులందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. కల్యాణ ప్రాంగణం వద్ద భక్తుల కోసం చేపడు తున్న ఏర్పాట్లను మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, ఎస్.సవిత, వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ సి.శ్రీధర్, జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్, టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం, సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు, జెసి అదితి సింగ్ తదితర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలోని పరిపాలనా జరిగిన సమీక్షాలో మంత్రి ఆనం మాట్లాడుతూ ఆగమ శాస్త్రం ప్రకారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రభుత్వ పండుగకు ముత్యాల తలంబ్రాలు సమర్పించదానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని వెల్లడించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్టుగా టిటిడి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కోరారు. సిఎం వచ్చి వెళ్లేంత వరకు పోలీస్ యంత్రాంగం అప్ర మత్తంగా ఉండాలని కోరారు. హైవే సెక్టార్లలో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి అంబులెన్స్‌లను అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు పెంచాలని, వేసవి నేపథ్యంలో ఫైర్ సర్వీస్ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు వెలుపలికి సులువుగా వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఒంటిమిట్ట ఆలయాన్ని ఒక గొప్ప పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పనిచేసి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేదిక ప్రవేశ,

కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రుల బృందం

నిష్క్రమణ మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకో వాలని సూచించారు. కల్యాణ వేదిక వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు మెరుగైన సౌక ర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పిం చాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్‌పితో సమన్వయం చేసుకుని పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది పటిష్ట బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా, వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్ టిసి బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కళ్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదం కౌంటర్లు, లైటింగ్, వైద్యశిబిరాలు, మరుగు దొడ్లు, అద నపు పారిశుధ్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, కడప, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఎర్విన్, చిన్నయ్య, టిటిడి డిప్యూటీ ఇఒ నటేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిపిఒ రాజ్యలక్ష్మి, పంచా యతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ రమణయ్య, జిల్లా రెవెన్యూ, పోలీసు, హెల్త్, మెడికల్, తదితర పలువురు జిల్లా, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డిసి దుర్మరణం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- అధికారి మృతికి మంత్రి, కలెక్టర్ నివాళి
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంతాపం
- రమాదేవి కుటుంబ సభ్యులకు ఫోన్లో సిఎం చంద్రబాబు నాయుడు పరామర్శ
- తాత్కాలికంగా పిజిఆర్ఎస్ నిలిపివేత

ప్రజాశక్తి-పీలేరు/రాయచోటి/రాయచోటి టౌన్

రమాదేవి (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి మృతి చెందారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజి ఆర్ఎస్ కార్యక్రమంలో స్పెషల్ కో-ఆర్డి నేటర్‌గా విధులకు హాజరయ్యేందుకు పీలేరు నుంచి రాయచోటికి కారులో తన ఇద్దరు సిబ్బం దితో బయలుదేరారు. మార్గమధ్యలో సంబేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెతో ప్రయా ణిస్తున్న అటెండర్ మాల్యా గేరూనాయక్, కంప్యూటర్ ఆపరేటర్ ముబారక్ తీవ్రంగా గాయపడ్డారు. ముబారక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అనంతపురం జిల్లాకు చెందిన మృతురాలు ఎస్.రమా దేవి 2024 ఫిబ్రవరి 5న పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయానికి ఎస్‌డిసిగా కర్నూలు నుంచి బదిలీపై వచ్చారు. ఎస్‌డిసి పీలేరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారిగా కూడా వ్యవహరిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్ని కలు నియోజకవర్గంలో సజావుగా జరిగేందుకు కీలకంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే పీలేరు తహశీల్దారు భీమేశ్వ రరావు, హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు.

నివాళి అర్పించిన మంత్రి, కలెక్టర్

పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి మృతి చెందడం చాలా బాధాకరమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మార్చురీలో ఉన్న మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటన వివరాలను పోలీ సులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విధులకు హాజరవుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెంద డం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఆమె సీటు బెల్టు పెట్టుకుని ఉంటే ప్రమాదంలో మృతిచెంది ఉండేవారు కారని పేర్కొన్నారు. అనంతరం గాయపడిన వారిని మంత్రి పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఎస్.రమాదేవి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.

ప్రమాదానికి గురైన ఎస్‌డిసి ప్రయాణించిన కారు

వారి వెంట డిఆర్ఒ మధుసూదన్‌రావు, ఆర్‌డిఒ ఉన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంతాపం

రోడ్డు ప్రమాదంలో హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి మృతి చెందడం అత్యంత దురదృష్టకరమన్న అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆకస్మిక మరణంపై వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తాత్కాలికంగా పిజిఆర్ఎస్ నిలిపివేత

హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సోమవారం జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే పిజిఆర్ఎస్‌ను నిలిపేశారు. ఆమె స్పెషల్ ఆఫీసర్‌గా కార్యక్రమానికి హాజరయ్యేందుకు కలెక్టరేట్‌కు వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ మేరకు పిజిఆర్ఎస్ ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆమె మృతికి జిల్లా అధికారులందరూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

రమాదేవి కుటుంబ సభ్యులకు సిఎం పరామర్శ

పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి మృతి బాధాకరమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రమాదేవి కుటుంబ సభ్యులను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ఆమె ఇద్దరు కుమారుల్లో ఒకరికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఆస్పత్రిలో గాయపడిన సిబ్బందిని పరామర్శిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

'మిట్స్'లో జాతీయ స్థాయి సింపోజియం

సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్ పాండియన్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, ఇంజి నీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగం వారు ఔరా-2కె 25 జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియంను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరులోని సిమెన్స్‌లో డేటా ప్రొఫెషనల్, రీసెర్చ్ ఇంజనీర్ అరుణ్ పాండియన్ పాల్గొని మాట్లాడుతూ ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ అనగానే అదేదో సాఫ్ట్వేర్ ఇంజినీర్ల భాష అని, ప్రతి ఒక్కరు తెల్లారి లేచిందగ్గర్నుంచీ రాత్రి పడుకునేదాకా అడుగడుగునా అది మన వెన్నంటే ఉంటోందనే విషయాన్నీ గ్రహించాలని పేర్కొన్నారు. కృత్రిమమేధని అదనంగా చేర్చితే దాని విలువ ఏకంగా రెట్టింపు అవుతోంది. అందుకే విద్య నుంచి వైద్యం వరకూ, వ్యాపారం నుంచి వ్యవసాయం వరకూ ఇప్పుడు ఆర్టిఫి షియల్ ఇంటె లిజెన్స్ ప్రమేయం లేని రంగం లేదంటే అతిశయోక్తి కాదని పేర్కొన్నారు. విద్యా ర్థులు నూతన పరిశోధనలు చేయాలనీ అన్నారు. డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నిం గ్, ఎఐ-ఆధారిత పరిశోధనలలో వారి అనుభవాన్ని విద్యార్థులతో పంచుకు న్నారు. వాస్తవ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు, దాని అనువ ర్తనాల గురించి విలువైన అంతర్దృష్టులను అందించారు. దేశవ్యాప్తంగా ఉన్న వర్ధ మాన సాంకేతిక నిపుణుల మధ్య సాంకేతిక ఆవిష్కరణ, సహకార అభ్యాసం, ఆలోచనల మార్పిడిని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ను ఏర్పాటు చేసినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథం పేర్కొన్నారు. ఈ సింపో జియంలో విస్తృత శ్రేణి సాంకేతిక సెషన్‌లు, పేపర్ ప్రెజెంటేషన్‌లు, ప్రాజెక్ట్ ఎక్స్ పోలు, పాల్గొనేవారిలో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రేరేపించడానికి రూపొం దించబడిన ఆకర్షణీయమైన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ చొక్కనాధన్, కో-ఆర్డినేటర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజలను దగా చేస్తున్న ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్న ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా కేవలం కక్ష్య సాధింపులకే పెద్దపీట వేస్తున్నారని, దీన్ని ప్రజలెవ్వరూ హర్షించరని వైసిపి నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి రాజంపేట అధికార ప్రతినిధి జయసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని, వసతి దీవెన, వాహన మిత్ర, సబ్సిడీ రుణాలు ఇవ్వకపోగా ప్రశ్నించిన వైసిపి నాయకులపై కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ డైవర్ట్ రాజకీయాలు చేస్తు న్నారని ఆరోపించారు. పిటిఎం ఎంపిపి మహమ్మద్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చి ముస్లింల ద్రోహిగా మిగిలిపోయారన్నారు. బిసి జిల్లా అధ్యక్షుడు సాంబశివ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతం బిసి లు ఉంటే కూటమి ప్రభుత్వం అణగదొక్కుతోందని, నేతన్న నేస్తం లేదని, మహిళలకు చేయూత ఇవ్వకుండా ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రతి ఇంట్లో సమస్యల సుడిగుండం ఉండేలా పాలన సాగుతోందన్నారు. పెద్దమండ్యం ఎంపిపి పూర్ణిక రమేష్ మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ప్రతి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేలా గండికోట నుంచి నీటిని విడుదల చేస్తూ ప్రాజెక్టులు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె వైసిపి యూత్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆహారం, నీటి సదుపాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వేసవి కాలం కావడంతో మూగజీవాల సేవలో హెల్పింగ్ మైండ్స్ బృందం నిమగ్నమైంది. హెల్పింగ్ మైండ్స్ 12వ వార్షికోత్సవంలో భాగంగా మదనపల్లి-కర్ణాటక అటవీ సరిహద్దుల్లో ఉన్న వానరాలకు ఆహారం, నీటి సదుపాయం కల్పిస్తోంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు పెరిగి పోతున్న నేపథ్యంలో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణాలు నీటి కోసం తల్లడిల్లుతున్నాయన్నారు. అరణ్యంలో ఎండల తీవ్రత పెరగడంతో మూగజీవాలు గుక్కెడు నీటికోసం ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయన్నారు. తాగునీరు, ఆహారం అందక కొన్ని వణ్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు అర్షియా, కిరణ్, సికిందర్, చైతు, చరణ్, రాబియా అంజూమ్ పాల్గొన్నారు.

వన్యప్రాణులకు ఆహారం, నీటి సదుపాయం చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ బృందం

నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

అధికారులపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సదుం మండలం, కలకటవారిపల్లిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అనధికారికంగా తొలగించిన తాహశీల్దార్ హుస్సేన్, ఎస్ఐ షేక్షావలిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యమలా సుదర్శన్ మాట్లాడుతూ కలకటవారిపల్లెలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కూరపర్తి అనే వ్యక్తి పెత్తందారులకు తొత్తుగా వ్యవహరించి, కుట్రతో అధికారులచే విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని పేర్కొన్నారు. అనధికారకంగా విగ్రహాన్ని తొలగించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యమల చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్, వీరనాల మాణిక్యం, లక్ష్మీపతి, మోహన్, అప్పయ్య, గురుమూర్తి, భాస్కర్, గంగరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అహ్మద్‌బాషాకు 14 రోజుల రిమాండ్

-కడప కేంద్ర కారాగారానికి తరలింపు

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

వైసిపి నాయకుడు, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి. అంజాద్‌బాషా తమ్ముడు ఎస్.బి.అహ్మద్ బాషకు కడప కోర్టు 14 రోజలు రిమాండ్ విధించింది. కడప తాలూకా పోలీసులు సోమవారం మధ్యాహ్నం కడప సెకండ్ ఎడిఎం కోర్టులో అహ్మద్ బాషాను హాజరు పరిచారు. ఈనెల 21వరకు రిమాండ్ విధించారు. అహ్మద్‌బాషా వివిధ కేసుల్లో నిందితుడిగా ఉండగా ఆదివారం తెల్లవారు జామున కువైట్‌కు వెళ్లేందుకు ముంబాయి ఎయిర్‌పోర్టుల ఉన్న సమయంలో కడప పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. పోలీసులు ముంబాయి నుంచి సోమవారం తెల్లవారు జామున కడపకు తీసుకు వచ్చారు. కడప నగర శివారుల్లోని పోలీసు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో 8 గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం ఆయనకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇన్‌స్పెక్టర్ తారాంరెడ్డి, తాలూకా ఎస్ఐ నాగ తులసి ప్రసాద్ సమక్షంలో వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అహమ్మద్ బాషను కడపకు తీసుకొచ్చారన్న విషయం తెలుసుకున్న సోదరుడు, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి అంజాద్‌బాష రిమ్స్‌లో పరామర్శించారు. అనంతరం పోలీసులు కడప రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా సిఆర్‌పిసి 326 కింద న్యాయమూర్తి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. అనంతరం పోలీసులు అహమ్మద్ బాషాను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

రిమ్స్‌లో వైద్య పరీక్షల కోసం అహ్మద్ బాషాను తీసుకు వెళుతున్న పోలీసులు

హంస వాహనంపై సీతారాముడు

ప్రజాశక్తి -ఒంటిమిట్ట : శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి ఏడు గంటల నుండి హంస వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులను కటాక్షించారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారు వేణుగాన అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 11 గంటలకు ఆలయంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించనున్నారు.ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. రాత్రి ఏడు గంటల నుండి భజన బృందాల కోలాటాల నడుమ పురవీధుల్లో హంస వాహనసేవ జరిగింది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - నందలూరు : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపిడిఒ రాధాకృష్ణ అధ్యక్షతన సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. అనంతరం మండలంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, విద్యుత్ వంటి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రజల సమ స్యలపై తనకు ఎవరైనా ఎప్పుడైనా కలవచ్చని సూచించారు. అధికారులు వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగితే మెరుగైన అభివృద్ధిని సాధించ వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, వైస్ ఎంపిపిలు అనుదీప్, తుమ్మల భావన, తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపిటిసిలు సోమిశెట్టి సునీత, రమేష్ రెడ్డి, సుభాన్ బాషా, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

సిగ్గులొలికే.. సిరి రాములోరు

- మోహినీ అవతారంలో మురిపించిన తేజోమూర్తి
- సూర్యచంద్రులపై దివ్య దర్శనం

మోహినీ అవతారంలో మురిపిస్తున్న తేజోమూర్తి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం రాత్రి 8.30 గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో తేజో మూర్తిగా మురిపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్ర భాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 6.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు తేజోమూర్తిగా తిరు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. సూర్య, చంద్ర ప్రభ వాహన విశిష్టతల గురించి ఆలయ సలహా దారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ సకలలోకములకు కాలగతిలో పగలు రాత్రులను సృష్టించి పాపపుణ్యములను నివారిం పజేసే అనంత శక్తి జ్యోతిస్వరూపడును నేనే అని భక్తులకు చాటి చెప్పు టయే సూర్య, చంద్రప్రభ వాహనసేవ విశిష్టత అని తెలిపారు. దేవదానవ సంగ్రా మమునకు మూలహేతువైన అమృతమదన సందర్భాన్ని తెలియజేస్తూ దేవతలకు మాత్రమే అమృతాన్ని పంచుతూ సాద్వికులకు మాత్రమే తన రక్షణ ఎల్లవేళలా ఉంటుందని, శ్రీ పట్టాభిరాముడి మోహినీ అవతార విశేషం అని తెలిపారు. సూర్యప్రభ వాహన సేవ అనంతరం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8:30గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు పల్లకీ మోహినీ అవతారంలో ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాఢవీధుల్లో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిటిడి అధికారులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, క్రిష్ణరాజు భట్టర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ, రాత్రి 8గంటల నుంచి గంటల 10 వరకు శ్రీ సీతారాముల కల్యాణో త్సవం, రాత్రి 11గంటలకు గరుడవాహన సేవ నిర్వహించనున్నారు.

నవధాన్య కిట్లు తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నవధాన్యాల కిట్లు తయారీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్య విత్తనాల కిట్లు తయారీ కార్యక్రమం నిర్వహించారు రూ.1000 విలువ గల 30 రకాల నవధాన్యాలతో దాదాపు 12.50 కిలోల బరువు గల కిట్లను తయారు చేశామని వ్యవసాయ అధికారి రమేష్ బాబు తెలిపారు. ఈ కిట్టుతో నేల సారవంతం పెరుగుతుందన్నారు. తేమశాతం పట్టి ఉంచే గుణం అనేది ఉంటుందని తెలిపారు. 365 రోజులు భూమిని కప్పి ఉంచవచ్చని, నేలలో పోషకాలు, సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. ముఖ్యంగా మామిడి తోటల్లో పూత నిలబడకపోతే తోటల్లో నవధాన్య విత్తనాలు చల్లడం వల్ల పూత, పిందెలు నిలబడడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు రైతులకు ప్రకృతి వ్యవసాయ నవధాన్య కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ సరస్వతి, మండల యూనిట్ ఇన్‌ఛార్జి గంగిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి షాహీర్‌బాషా, నాగమణి, లక్ష్మీదేవి, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

వైసిపి యువ నాయకుడు శశికుమార్‌రెడ్డి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం ఎస్‌వినగర్‌లో వైసిపి యువ నాయకులు బత్తిన శశి కుమార్‌రెడ్డి సోమవారం ఆకస్మిక మృతి చెందారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి శశి కుమార్‌రెడ్డి మృతదేహానికి దేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శశికుమార్ మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన సేవలు మరువలేనని అన్నారు. నివాళులర్పించిన వారిలో రాయలసీమ జోనల్ బూత్ కమిటీ మెంబెర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సి.హెచ్ రమేష్, ప్రతాప్ రెడ్డి, సర్పంచులు, బుడుగు శివయ్య, హరికృష్ణ రెడ్డి, ఎంపిటిసి మహేష్ రెడ్డి ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గాలివీడు

రెవెన్యూ గ్రామాలలో పనిచేసే విఆర్ఒలు ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని తహశీల్దార్ జె. భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, విఆర్ఒలు అల్లాబకాష్, లక్ష్మీ ప్రసన్న, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పుల్లంపేట

ఆదర్శ పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరిశీలకుడు పెంచలయ్య అన్నారు. ఆయన సోమవారం పుల్లంపేట లోని ఆదర్శ పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది ఆదర్శ పాఠశాలల్లోని పుస్తకాలు, దుస్తులు, బెల్టు నిలువ చేసేందుకు గదులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్టాక్ పాయింట్ పకడ్బందీగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. పుల్లంపేట, ఓబులవారిపల్లె, పెనగలూరు, చిట్వేలి స్టాక్ పాయింట్‌లను పరిశీలించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ చక్రధర్ రాజు, రెండవ ఎంఇఒ నాగ తిరుమలరావు, కరుణాకర్, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

- ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినిలు ఫలితాలు వచ్చే వరకూ ఎదురు చూడకుండా ఇప్పుడే ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. బ్రిడ్జి కోర్స్, ఇంగ్లీషు, తెలుగు, మ్యాథ్స్ ఫిజిక్స్, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్ వంటి సబ్జెక్టులలో ఏప్రిల్ 7వ తేదీ నుండి 23వ తేదీ వరకు బోధన చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు వారి ప్రకటనలకు మోసపోకుండా ప్రభుత్వ కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని సబ్జెక్టుల్లో నిపుణులైన, అనుభవం కలిగిన అధ్యాపకులు మదనపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారన్నారు. గత ఏడాది తమ కళాశాల విద్యార్థిని 979 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసిసి, ఇంగ్లీష్ మీడియం, హెచ్ఇసి ఉర్దూ మీడియం గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది కొత్తగా ఎం బైపీసీ కోర్స్ ప్రవేశపెట్టడం జరిగిందని, ఒకేషనల్ విభాగంలో అకౌంట్ అండ్ టాక్సేషన్, నర్సింగ్, సెరికల్చర్, గార్మెంట్ టెక్నాలజీ, టైలరింగ్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. అందులో ప్రవేశించి కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులలో చేరడానికి అవకాశాలు కలవన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల పనివేళల్లో ప్రిన్సిపల్, అధ్యాపకులను సంప్రదించి సలహాలను పొందవచ్చునని తెలియజేశారు.

బి.కొత్తకోటలో భారీ చోరీ

- రంగంలోకి దిగిన పోలీసులు, క్లూస్ టీం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గం, బి.కొత్తకోట పట్టణంలో భారీ చోరీ సంఘటన కలకలం రేపుతోంది. పోలీసుల కథనం మేరకు వివరాలు సంత బజారులో వీధిలో కాపురముంటున్న ఒ.కిరణ్ కుమార్ అనే ఉపాధ్యాయుడి ఇంట్లో అర్ధరాత్రి తలుపుల బద్దలు కొట్టి బంగారు, వెండి ఆభరణాలు నగదును దుండగులు దోచుకెళ్లారు. సుమారు ఏడు కిలోల వెండి, 160 గ్రాముల బంగారు, రూ.20 వేల నగదుతో పాటు విలువైన ఇంటి పత్రాలను దోచుకెళ్లినట్లు బాధితుడు కిరణ్ కుమార్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో పదవ తరగతి పరీక్ష పత్రాలను దిద్దడానికి భార్యాభర్తలు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటిలోని విలువైన వస్తువులు దోచుకుని వెళ్లారు. ఉదయం ఇరుగుపొరుగు వారు సమాచారం అందించడంతో హుటాహుటిన తమ ఇంటి వద్దకు చేరుకొని ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం చూసి పోలీసులకు బాధితులు సమాచారం ఇవ్వగా, సంఘటన స్థలానికి క్లూస్ టీం, పోలీసు సిబ్బంది చేరుకొని ఆధారాలు సేకరిస్తున్నారు. ఇటీవల దొంగల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం పోలీసులు

ప్రభుత్వ కళాశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కుడా (కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి) చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మండలంలోని కె.బుడుగుంట పల్లె వద్ద గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల 42 వ వార్షికోత్సవం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎం. భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి ఇన్‌ఛార్జి, కుడ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు జ్యోతి ప్రజ్వలన చేశారు. తర్వాత జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈ సంవత్సరంలో విద్యార్థులు సాధించిన విజయాలను నివేదిక రూపంలో చదివి వినిపించారు. కళాశాలను రాష్ట్ర స్థాయిలో నిలుపుటలో అధ్యాపకులు విద్యార్థులు కృషి ఎంతో ఉందని తెలిపారు. ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ కళాశాల 42 వ వార్షికోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని విద్యార్థినులకు అవసరమైన ఎలక్ట్రికల్ వాహనాన్ని (ఆటో)ను తప్పక ఇస్తానని, అవసరమైతే మరొక వాహనాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. రైల్వే కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ కలుగబోతుందని చెప్పారు. త్వరలో ఆరు లైన్‌ల రోడ్డు త్వరలో రాబోతుందని చెప్పారు. కళాశాల అభివృద్ధికి శాసన సభ్యుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ఆరవ శ్రీదర్ మాట్లాడుతూ రైల్వే కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి రావడం అందునా, పేద వారు కావటం వారిని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రిన్సిపల్, అధ్యాపకులను కోరారు. సిఐ కె.హేమ సుందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శక్తి యాప్‌ను ఉపయోగించి రక్షణ పొందాలని కోరారు. కళాశాల నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు ముక్కా రూపానందరెడ్డి, ఆరవ శ్రీదర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ముక్కా రూపానందరెడ్డిని, శాసన సభ్యులు ఆరవ శ్రీదర్ ను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక నిర్వహించారు. కార్యక్రమంలో కె.బుదుగుంట పల్లె సర్పంచి డి.చంద్రశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి కుమార్ రాజు, మాజీ ఎంపిటిసి టి.శేఖర్.గ్రామ నాయకులు కె.సుబ్బరామిరెడ్డి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ ముక్కా, ఎమ్మెల్యే శ్రీధర్

చెడు అలవాట్లే అనారోగ్యానికి కారణం

ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి-పీలేరు

చెడు అలవాట్లే మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని తలుపుల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీలేరులోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'అలసట నుండి-ఆనందం వైపు' అనే అంశంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ జీవన నైపుణ్యాలనేవి చెప్పుకోడానికి చిన్నవైనా, వాటిని ఆచరిస్తే జీవితంలో పెద్ద ఫలితాలను ఇస్తాయని అన్నారు. 'ఆరోగ్యకరమైన ప్రారంభం-ఆశాజనకమైన భవిష్యత్తు' అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో మానసిక, శారీరక ఆరోగ్యం ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా పొందాలంటే తగినంత నిద్ర, శారీరక శ్రమ, బలానిచ్చే పోషకాహారం అవసరమని చెప్పారు. మద్యం ధూమపానం లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, మంచి జీవితానికి ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పరచుకుని వాటికోసం నిరంతరం శ్రమించడం ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎఎన్ఎం భార్గవి, ధన భాగ్యమ్మ విజయ, ప్రమీల, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రజలు ఆరోగ్యం పై మరింత శ్రద్ధ వహించాలని ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ సనా తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ వరకు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు. 'ఆరోగ్యకరమైన ఆనందాలు-ఆశాజనక భవిష్యత్తులు' సాధిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో తీరికలేని పనులతో మనిషి తన ఆరోగ్యం గురించి పట్టించుకోవడం మానేస్తున్నారన్నారు. సమయానుకూలం లేని ఆహారం, నిద్రలేమి మనిషిని బాగా దెబ్బతీస్తున్నాయన్నారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ జీవనం సాగించాలని తెలిపారు. కాలుష్య నివారణలో మనిషి ముఖ్య పాత్ర పోషించాలన్నారు. మాతా శిశు సంరక్షణ సేవల ఆవశ్యకతపై, మాతృ, శిశు మరణాల నివారణ పై, ఉన్నత ప్రమాణాలతో కూడిన జీవన శైలిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఇంద్రావతి, నిహెచ్ఎన్ సరోజ, హెల్త్ సూపర్వైజర్లు దేవేంద్ర, దేవ కుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థల పరిశీలనపై చర్చిస్తున్న మంత్రులు, నాయకులు

మహానాడు స్థల పరిశీలనలో మంత్రులు

- కడప నగర శివార్లలోని 3 ప్రాంతాలు పరిశీలన

ప్రజాశక్తి కడప అర్బన్

జిల్లాలో మే 27,28,29 తేదీల్లో నిర్వహించే మహానాడు నిర్వహణ ఏర్పాట్లకు అవసరమైన స్థలాన్ని పరిశీలించేందుకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, మంత్రులతో కూడిన మహానాడు కమిటీ జిల్లాలో పర్యటించింది. సోమవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు, కడప జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి సవితమ్మ, మంత్రి అనగాని సత్యప్రసాద్, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న స్థలాలను పరిశీలించారు. నగరం శివారు ప్రాంతంలో ఉన్న ఎన్‌జిఒలే అవుట్స్, జయరాజ్ గార్డన్, ఎయిర్ పోర్టు వద్ద శాటిలైట్ సిటీకి దగ్గర ఉన్న ప్రాంతాల్లో మహానాడు ఏర్పాట్లకు వీలవుతుందా.. లేదా అని సమాలోచన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా మహానాడు నిర్వహించడం 43 సంవత్సరాల నుంచి ఆనావాయతీగా వస్తుందన్నారు. ఈ సారి కడపలో మహానాడు నిర్వహించాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగా కడపలో పర్యటించామని చెప్పారు. తాము పరిశీలించిన విషయాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళతామన్నారు. టెక్నికల్ టీం కూడా పరిశీలనకు వస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను దృష్టిలోకి పెట్టుకుని ఇక్కడ మహానాడు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోమారు కమిటీ పరిశీలనకు వస్తుందని పేర్కొన్నారు. అప్పుడు తుదినిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, చైతన్యరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ లింగారెడ్డి, జమ్మలమడుగు ఇన్‌ఛార్జీ భూపేష్‌రెడ్డి, మాజీ మంత్రి కల్వ శ్రీనివాసులు, ముక్తియార్, బి.టెక్ రవి, అమీర్‌బాబు, మహానాడు నిర్వహణ జోన్‌ల్ కో-ఆర్డినేటర్లు, ఇన్‌ఛార్జులు, జిల్లా కార్యవర్గం పాల్గొన్నారు.

రేపు బిషప్ పాల్ ప్రకాష్‌కు పట్టాభిషేకం

ప్రజాశక్తి -కడప అర్బన్

ఈనెల 9న వైభవంగా నిర్వహించబోయే బిషప్ సగినాల పాల్ ప్రకాష్ పట్టాభిషేకం మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విరివిగా తరలిరావాలని క్యాథోలిక మేత్రాసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి సంబటూరు సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం మరియాపురం బిషప్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప డయాసిస్‌కు నూతన కాపరిగా విశ్వశ్రీ సభ కాపరి పోపు ఫ్రాన్సిస్ ద్వారా సగినల పాల్ ప్రకాష్ ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన పట్టాభిషేక మహోత్సవం మరియాపురం, సెయింట్ జోసెఫ్ హై స్కూల్ కంబ్లీస్ ప్రాంగణంలోని అరులయ్య వేదికపై నిర్వహిస్తారని తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా వాటికన్ నుంచి పోప్ దూత లియోపోల్డ్ జిరెల్లి, ముఖ్య అతిథిగా, ప్రధాన అభిషేక పీఠాధిపతులుగా హైదరాబాద్ మేత్రాసనానికి చెందిన కార్డినల్ పూల అంతోని, సహాయ అభిషేక పీఠాధిపతులుగా బిషప్ డాక్టర్ గాలి బాలి, నెల్లూరు బిషప్ డాక్టర్ మోషేస్ డి ప్రకాశం పాల్గొంటున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు నుంచి దాదాపు 20 మంది బిషప్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో తిరుపతి విచారణ గురువు ఫాదర్ ఆనంద్, ఎర్రగుంట్ల విచారణ గురువు ఃమోజెస్ పాల్గొన్నారు.

చిత్రకళా ఉత్సవంలో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాజమండ్రిలో జరిగిన అమరావతి చిత్రకళా ఉత్సవంలో యోగి వేమన విశ్వవిద్యాలయం, లలిత కళా విభాగం విద్యార్థుల చిత్రాలు వీక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. వైవీయూ విద్యార్థుల పెయింటింగ్స్‌ను సందర్శకులు మెచ్చుకుని కొనుగోలు చేశారు. ప్రతిభ చూపిన వైవీయూ బిఎఫ్ఏ విద్యార్థి ముత్యంను రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మాత్యులు కందుల దుర్గేష్ శాలువా కప్పి అభినందించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాదాపు రెండు వందల చిత్రాలను ప్రదర్శించారు. లలితకళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు, అధ్యాపకులు సి.హెచ్. వెంకటేష్, బి.ఈరప్ప ప్రదర్శనకు మార్గదర్శకం వహించారు. విద్యార్థులు చూపిన ప్రతిభ పట్ల విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాధ రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ ఇందిరానగర్ యూత్

ప్రజాశక్తి -కడప అర్బన్ : వేటూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి క్రికెట్ టోర్నమెంట్ ఇందిరానగర్‌లో నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో నాలుగు జట్లు తలపడ్డాయి. పోటీల్లో రన్నర్స్, విన్నర్స్ జట్టును కప్పులు, మెడల్స్, శాలువాలతో సత్కరించారు. రన్నర్స్‌గా సుగాలి తండా జట్టు, విన్నర్స్‌గా ఇందిరానగర్ యూత్ నిలిచారు. కప్పులు స్థానిక రామాలయం గుడిలో ఏటూరి కుటుంబం, వారి అనుచరులు అందజేశారు. రన్నర్స్ కెప్టెన్‌గా చిన్న, విన్నర్స్ కెప్టెన్ బన్నీ కప్ అందుకున్నారు. ఏటూరు రామచంద్రారెడ్డి రన్నర్స్‌కు కప్పుతో పాటు నగదు రూ.8116, విన్నర్స్‌కు రూ.15116 నగదుగా అందించారు. ఈ సందర్భంగా ఏటూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ ఇటువంటి సాంస్కృతిక, గేమ్స్, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏటూరి కుటుంబ సభ్యులతో పాటు వాల్మీకి సంఘ నాయకులు జక్కల శంకరయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలి

ప్రజాశక్తి-అట్లూరు : రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, పరీక్షల తేదీ ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన డివైఎఫ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఛలో విజయవాడకి పిలుపునిస్తామని జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం హయంలో 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇంతవరకు పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదని అన్నారు. ప్రతిపక్షంలో యువగలంలో నారా లోకేష్ ఇచ్చిన హామీలకు ఇంతవరకు అతీగతీ లేదని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని చెప్పారు. తక్షణమే సుప్రీం కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ అట్లూరు మండల నాయకులు శ్రీకాంత్, భాను, విష్ణు, అజయ్ పాల్గొన్నారు.

కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి.యామిని

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర వ్యాప్తంగా 54 మంది జిల్లా జడ్జిలు, జిల్లా అదనపు జడ్జిలను బదిలీ చేశారు. వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి. యామిని నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న యామిని కడపకు బదిలీ అయ్యారు. కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జి .శ్రీదేవి అనంతపురంలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ లేబర్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కడపలోని ఆరవ అదనపు జిల్లా (ఫ్యామిలీ కోర్టు) జడ్జిగా పనిచేస్తున్న షేక్ ఇంతియాజ్ అహ్మద్ విజయవాడ జిల్లా కోర్టులో 14 అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా కోర్టులో పోక్సో కోర్టు జడ్జ్ గా పని చేస్తున్న ఎన్. శాంతి కడపలోని ఆరవ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

జిల్లాకు ఢిల్లీ స్థాయిలో ఖ్యాతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లా ఖ్యాతి ఢిల్లీ స్థాయిలో ప్రకాశించాలని ప్రకాష్ నగర్ జీసస్ బ్లెస్సింగ్స్ చర్చి పాస్టర్ విజయ్ కిషోర్ అన్నారు. సోమవారం చర్చి ఆవరణలో ఇటీవల ఇన్‌టాక్ జాతీయ స్థాయి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా అధిక మెజారిటీతో గెలుపొందిన ఇంటెక్ జిల్లా కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పర్య వేక్షణలోని ఇంటాక్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు గౌరవం సాధించడం అభినందనీయమన్నారు. జెఎసి సభ్యులు, పెద్దలు, క్రీస్తు జనులు, మహిళా విభాగం ప్రతినిధులు చిన్నపరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆయన స్పందిస్తూ జిల్లాలో ఎన్నో పురాతన మైన గొప్ప చర్చిలు ఉన్నాయని, పాత కలెక్టరేట్, శాసనాలు, గండికోట తదితరాల రక్షణ, అభివృద్ధి కోసం తనకు అవకాశం ఉన్న మేరకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రంగనాథ రెడ్డి, లయన్ సంజీవరెడ్డి, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు,.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ అబ్దుల్ రహీం

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- కలకడ

చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ఎదుట, ఆర్టీసీ బస్టాండ్ నందు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలానికి ప్రజలకు నీటి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రాల వద్ద సుచి శుభ్రతను పాటించి ప్రతిరోజు చలివేంద్రాల్లో నీటిని నింపాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల కేంద్రమైన పుల్లంపేట బస్టాండ్‌లో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పుల్లంపేట సర్పంచి ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎండలు ఎక్కువైనందున ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ప్రజలందరూ చలివేంద్రంలో చల్లటి నీటిని తాగి తమ దాహార్తిని తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ముత్తయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక ఎంపిడిఒ జవహర్ బాబు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో రాయచోటి ఎంపిడిఒ డాక్టర్. పి. వెంకటేష్‌ను ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధ కూలీలకు పనులు కల్పించాలన్నారు. సిసి రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇఒపిఆర్‌ఢి, ఆర్‌డబ్ల్యుఎస్, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

ఆదర్శ పాఠశా లో ఈ నెల 20న నిర్వహించబోయే 6వ తరగతిలో ప్రవేశ పరీక్షపై విద్యార్థులకు సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్యామలాదేవి మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఆరవ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష ఎలా రాయాలనే విషయంపై అవగాహన కల్పించామన్నారు. పరీక్ష సమయంలో హాల్ టికెట్ నెంబర్ ఎలా వేసుకోవాలి, పరీక్ష సమయాన్ని ఎలా వినియోగించుకోవాలి ప్రశ్నలకు ఆన్సర్ సీట్లో ఎలా రాయలనే అనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిఎస్‌పి రాజంపేట నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడిగా రామ్మోహన్

ప్రజాశక్తి- వీరబలి

బిఎస్‌పి రాజంపేట నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడిగా పెద్దివీటి రామ్మోహన్‌ను, అన్నమయ్య జిల్లా సెక్రటరీగా పెద్దివీటి నరసింహులు ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాలు మేరకు జిల్లా అధ్యక్షుడు యుగంధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి మండలానికి చెందిన పెద్దివీటి రామ్మోహన్ పార్టీ బలోపేతానికి జిల్లా కమిటీలో నిబద్ధతతో కృషి చేస్తానని చెప్పారు. బడుగు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున కృషి చేస్తానని అన్నారు. నరసింహులు మాట్లాడుతూ పార్టీ కోసం బడుగు బలహీన వర్గాల సమస్యల కోసం వాటిని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి - పుల్లంపేట

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని ఎంఇఒ చక్రధర్ పేర్కొన్నారు. మండలంలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో యాజమాన్య కమిటీ, తల్లితండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను 60కి పెంచితే ఆదర్శ పాఠశాలగా మార్పు చెందుతుందని చెప్పారు. గ్రామంలోని తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. చైర్మన్ మజీద్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల కోసం ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారని, వారికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. తల్లితండ్రులు మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలకి ధీటుగా మన పాఠశాల లో అన్ని వసతులు ఉన్నాయని, గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్చి బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సేవా భావంతో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రోగులకు సేవాభావంతో వైద్య సేవలు అందించాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. డాక్టర్ అమృత ప్రియ నూతనంగా ఏర్పాటు చేసిన ఇఎన్‌టి క్లినిక్‌కు సోమవారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా క్లినిక్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆసుపత్రి యాజమాన్యం పుష్పగుచ్చం అందజేసి యల్లటూరును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మన్నూరు సిఐ కులాయప్ప, జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, సుధాకర్, కోలాటం హరికృష్ణ, ఆకుల చలపతి, మల్లిఖార్జున, కుమార్ రాజు, శివశంకర్ రాజు, నారదాసు రామచంద్ర, వెంకటేశ్వరరావు, పత్తి నారాయణ పాల్గొన్నారు.

బిసి సెల్ అధ్యక్షుడిగా ఆవుల విశ్వనాథ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపాలిటీ వైసిపి బిసి సెల్ అధ్యక్షుడిగా నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఆవుల విశ్వనాథ్ నియమితులయ్యారు. సోమవారం విశ్వనాథ్ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి మదనపల్లె టౌన్ బిసి సెల్ అధ్యక్షుడుగా నియమించినందుకు పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, నిస్సార్ అహ్మద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కూడగట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నిస్సార్ అహ్మద్‌ను సన్మానిస్తున్న విశ్వనాథ్